# భూపంపిణీ

- మాదుగుండు కృష్ణ

కందెనూరు రాజ్యంలో రామప్ప రాజు. అతడు గొప్ప బలవంతుడు. భూమిలేని పేద రైతులకు ఉగాదినాడు భూదానం చేయాలని నిర్ణయించుకున్నాడు. రాజ్యంలో ప్రకటనగా దండోరా వేయించాడు.

అది విని ఆ రోజు చాలామంది వచ్చారు. జనసంఖ్యను చూసి రాజు ఆశ్చర్యపోయాడు. ఉన్నవారు లేనివారు అందరొచ్చారు ఆశగా. ఎవరికివ్వాలి ఎవరికిలేదు ఏం చేయాలో దిక్కు తోచలేదు. నిజమైన వార్ని గుర్తించి వారికే భూమి ఇవ్వాలని నిశ్చయించుకున్నాడు.

'ఏరివేత అంత సులభం కాదు, తొందరగా కూడా కాదు' సలహా ఇచ్చాడు మంత్రి సుబుద్ధి.

కార్యాలోచనకు వ్యవధి తీసుకొని భూపంపిణీ వాయిదా వేశాడు రాజు. ఉపాయం ఆలోచించి వుత్తమ సలహా ఇవ్వమని కోరాడు మంత్రిని.

వారం రోజుల తర్వాత పిలువగా మళ్ళీ వచ్చారు జనం. అప్పటికంటే ఇప్పుడే ఎక్కువ వున్నారు.

'ఉచితంగా వచ్చేదాన్ని ఎందుకు వదులుకోవాలి' గుంపులు గుంపులుగా వచ్చారు.

'సరే ఇస్తాను రండి' అందర్ని రమ్మని తీసుకెళ్ళాడు రాజు.

రాజు తన పరివారంతో వెళ్ళుచుండగా భూమి కోరినవారు కాలినడకన వెంబడించారు. అలా చాలా దూరం వెళ్ళారు.

కొందరు ఇష్టంలేక నడవక వెనుదిరిగారు. పరివారం కొండను సమీపించింది. అయిష్టంతో మరికొందరు ఆగిపోయారు.

సూర్యుడు నడినెత్తిన వచ్చాడు. ఎండ బాగా వుంది. వద్దులే అనుకొని సగం మందికంటే ఎక్కువ వెళ్ళిపోయారు. వెంట వున్నది కొద్దిమంది మాత్రమే.

రాళ్ళు రప్పలతో కూడివున్న బంజరు భూమిని చూపిస్తూ తీసుకోమన్నాడు రాజు. అదెందుకు దండగా అని నిరాశతో వెనుదిరిగారు మరికొందరు.

ఇక మిగిలింది కొందరే. ఇచ్చినది ప్రసాదముగా భావించి కష్టపడి ఎలాగో చక్కచేసుకొని పొలాన్ని సాగులోకి తెద్దామనుకున్నారు వారు.

వారినే నిజమైన పేదరైతులుగా గుర్తించాడు. కష్టపడి పంటలు పండించే రైతులు వారేయని, వార్ని నదివైపు తీసుకెళ్ళాడు. సారవంతమైన నేలను పంచి పట్టాలు ఇచ్చాడు రాజు.

*****